
హ్యాట్రిక్‌కు బీఆర్‌ఎస్ | పూర్వ వైభవానికి బీజేపీ | పాగాకు కాంగ్రెస్!

● సనత్‌నగర్‌లో త్రిముఖ పోటీ ● ఓటర్లపై హామీల వర్షం ● నువ్వా నేనా అంటూ పోటాపోటీగా ప్రచారం



సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మారుతున్న కాలంలో పాటు పార్టీలు అభ్యర్థుల బలాబలాలు మారుతూ వస్తున్నాయి. హ్యాట్రిక్ కోసం ఒకరు..పూర్వ వైభవం కోసం మరొకరు..పాగా కోసం ఇంకొకరు ప్రణాళికలు పన్నుతున్నారు. గెలిపే ధ్యేయంగా నువ్వా నేనా అనే విధంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా కొనసాగిన సనత్‌నగర్ మధ్యలో టీడీపీకి అవకాశం కల్పించింది. కాంగ్రెస్, టీడీపీలు దీటుగా నిలిచాయి. నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్‌ఎస్ తర్వాత 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆ వెంటనే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా చేసి, గులాబీ కండువా కప్పుకున్నారు. 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మొదటిసారి విజయం సాధించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్‌నగర్ నుంచి ఇప్పుడు పోటీ చేయడం మూడోసారి.
2014లో టీడీపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డిపై విజయం సాధించారు, 2018లో టీడీపీ, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిగా రంగంలోకి దిగిన కూన వెంకటేష్ గౌడ్‌పై తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజయం సాధించారు. 2023లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో దిగారు. –బన్సీలాల్‌పేట్

ముగ్గురూ దీటుగా..

సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు పార్టీల అభ్యర్థులు తామంటే తాము గెలుస్తామనే ధీమాతో ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి తలసాని, కాంగ్రెస్ నుంచి జర్నలిస్ట్‌గా కొనసాగిన డాక్టర్ కోట నీలిమ, బీజేపీ నుంచి మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి రంగంలో ఉన్నారు. 1989లో ఇక్కడి నుంచి గెలిచిన మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎం అయ్యారు. 1992లో ఆయన గవర్నర్‌గా వెళ్లడంతో జరిగిన ఉప ఎన్నికలలో మర్రి శశిధర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1994లో కూడా గెలిచి మంత్రి అయ్యారు. 2004, 2009లో కూడా మర్రి శశిధర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో దీటైన అభ్యర్థులుగా కొనసాగుతూ వస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియమితులైన తర్వాత మర్రి శశిధర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన శశిధర్‌రెడ్డి ఈ సారి బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. ఇప్పటి వరకు మర్రి శశిధర్‌రెడ్డి, తలసాని నడుమే గట్టి పోటీ ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తూ వచ్చారు. కాని ప్రస్తుతం కాంగ్రెస్ పుంజుకోవడం ఓ జర్నలిస్ట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండటంతో ఈ సారి నియోజకవర్గంలో దీటైన స్థాయిలో త్రిముఖ పోటీ జరగనుంది.

పార్టీల పరంగా..

పార్టీల పరంగా చూస్తే ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్‌ఎస్ బలంగా ఉన్నాయి. బీజేపీ గతంలో టీడీపీ పొత్తు కారణంగా చాలాసార్లు పోటీకి దూరంగా ఉండటంతో దీటుగా ఎదగలేకపోయింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌కు చెందిన మర్రి శశిధర్‌రెడ్డి బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగడంతో దీటైన పోటీని ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే మంత్రిగా కొనసాగుతూ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులను చేపట్టడం ద్వారా తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు చేరువయ్యారు. తొమ్మిదేళ్లలో తాను చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదం చేస్తాయని తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తనకు దీటైన పోటీని కూడా ఇవ్వలేరని తలసాని నమ్మకంతో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకోవడం అలాగే ఆరు గ్యారంటీ హామీలు, ప్రభుత్వ వ్యతిరేకత, స్థానికంగా మంత్రి తలసాని ప్రజలను నిర్లక్ష్యం చేయడం కూడా తన విజయానికి దోహదపడుతాయని డాక్టర్ కోట నీలిమ భావిస్తున్నారు. 1992 నుంచి 4 సార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి మంత్రిగా కొనసాగి సనత్‌నగర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి పనులు చేపట్టిన కారణంగా ఇక్కడి ఓటర్లు తనను ఆదరిస్తారని బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి ఆశిస్తున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం అభ్యర్థులు మాత్రం గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉండగా ఓటర్లు మాత్రం ఎవరిని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

జంగ్ తెలంగాణ 2023

'ఆరు గ్యారంటీ'లతో బీఆర్‌ఎస్‌కు వణుకు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వెన్నెల

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీ నేతల్లో వణుకు పుట్టిస్తోందని ఆ పార్టీ కంటోన్మెంట్ అభ్యర్థి జి. వెన్నెల అన్నారు. సీనియర్ నాయకులు ప్యారసాని రామ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆమె ఏడో వార్డు నెహ్రూసెంటినరీ కాలనీ, గన్‌రాక్ బస్తీ, పెద్దకమేల, ఇన్‌ఫ్రాంట్ జీసీస్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీ ప్రజా గాయకుడు దివంగత గద్దర్ కుమార్తెగా మీ ముందుకు వచ్చానని అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో కుటుంబపాలన, అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కారణంగా సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయని తాను గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో ముత్తు, రాధ, మాలతి, లాలి, మోహన్, డెంజిల్, అనిల్, విజయ్, గిరి పాల్గొన్నారు.

బౌద్ధనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రచారం



ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న ఆదం సంతోష్

బౌద్ధనగర్: ప్రతీ బస్తీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది కాంగ్రెస్ పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల ఆశీస్సులతో తాము విజయం సాధిస్తామన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరలేదని, పూర్తిగా సమస్యల వలయంలో ప్రజలు అవస్థలు పడుతున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు.

చిరువ్యాపారులకు అండగా బీజేపీ



వ్యాపారులతో మాట్లాడుతున్న మేకల సారంగపాణి

చిలకలగూడ : ఫుట్‌పాత్, తోపుడుబండ్లపై క్రయవిక్రయాలు చేసే చిరువ్యాపారులు బీజేపీ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి మేకల సారంగపాణి అన్నారు. సీతాఫల్‌మండి చౌరస్తాలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. చిరువ్యాపారులు, మహిళ సంఘాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముద్ర రుణాలు అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణతో పాటు సికింద్రాబాద్‌లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు.

'సనత్‌నగర్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం'



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన పద్మారావునగర్‌లోని లక్ష్మీ అపార్టుమెంట్, సప్తగిరి అపార్టుమెంట్, నాగదేవత టెంపుల్, ఈశ్వరమ్మ బస్తీ, హమాల్‌బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హమాల్‌బస్తీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేశామని..ఎన్నికల అనంతరం డబుల్ బెడ్రూమ్‌ల నిర్మాణాన్ని చేపడుతామన్నారు. తాము చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రచారానికి వెళ్లిన ఆయనకు మహిళలు మంగళ హారతులు, పుష్పగుచ్ఛాలతో స్వాగతాలు పలికారు. అంతకు ముందు న్యూబోయిగూడ ఎంఎస్‌కే విఠల్ సెంట్రల్ కోర్టు అపార్టుమెంట్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, సురేష్, ఏసూరి మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశన్, వెంకటరమణ, రవి పాల్గొన్నారు.

- పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయా పార్టీలకు చెందిన కిషన్, మల్లేష్, రాజు తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం..

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కళాసీగూడలో బెంగాలీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సమ్మేళన్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు కొన్ని వర్గాల ప్రజలు ఆందోళనకు గురయ్యారని కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఆ అనుమానాలు తొలగించేలా ప్రశాంత వాతావరణాన్ని కల్పించిందన్నారు. అర్హులందరినీ అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగస్వాములను చేస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తలసాని సాయి కిరణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు షేక్ అబ్దుల్ హుస్సేన్, మెహదుల్, సుమార్ అల్లా, సుకాంత్ కంజీలాల్, ఉత్తమ్‌బాబు పాల్గొన్నారు.

పరామర్శ..

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు రాణిబాయిని కుమారుడు దీపక్ (36) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న తలసాని సోమవారం బాపూనగర్‌కు విచ్చేసి రాణిబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

సనత్‌నగర్: దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు సోమవారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాంగోపాల్‌పేట డివిజన్ ధోబీఘాట్‌కు చెందిన వెంకటేష్, అభిషేక్, తేజ, ప్రదీప్, యోగేష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం



పార్టీలో చేరిన వారితో పద్మారావుగౌడ్

లాలాపేట: ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని సికింద్రాబాద్ ఆ పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తార్నాక డివిజన్ లాలాపేటలోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి పనులను కేవలం తొమ్మిదేళ్లలో పూర్తి చేశామన్నారు. సబ్బండ వర్గాలకు ప్రయోజనం కలిగేలా వ్యవహరిస్తున్నామన్నారు. జంట నగరాల్లో వివిధ ప్రాజెక్టులు చేపట్టామని, కోతల్లేని విద్యుత్ సరఫరా తమ ప్రభుత్వానికే సాధ్య పడిందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో కొత్తగా జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని తుకారాంగేట్‌లో ఆర్‌యూబీ నిర్మించామన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ నేతృత్వంలో ఆర్యనగర్, శాంతినగర్ ప్రాంతాలకు చెందిన పలువురు యువకులు పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేటర్లు సునీత, కంది శైలజ, సునీల్ ముదిరాజ్, మల్లాకార్జున్, స్టాలిన్ కృష్ణవేణి, వేణుగోపాల్‌రెడ్డి, కోళ్ల వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగరవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. బేగంపేట ప్యాలెస్‌లో సోమవారం జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన గోవా రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్ పరవడి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు.

మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలి



ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, ఎంఎస్పీ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 11న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలన్నారు. అదే విధంగా ఈ నెల 7న అడ్డగుట్ట డివిజన్‌లోని లోహియా నగర్ బస్తీలో మాదిగల విశ్వరూప సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు మురళీధర్, విక్కీ, మహేష్, యాదగిరి, జగన్, శివప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో విజేతగా లక్నో జట్టు



ముగింపు వేడుకలో మాట్లాడుతున్న నిఖత్‌భాను

రసూల్‌పురా: పికెట్ కేంద్రీయ విద్యాలయ క్రీడామైదానంలో జరిగిన జాతీయ స్థాయి కేంద్రీయ విద్యాలయాల అండర్–14 ఖోఖో పోటీల్లో లక్నో జట్టు విజేతగా నిలిచింది. బెంగళూరు జట్టు నాలుగు పాయింట్లు, రెండు పాయింట్లతో ఆగ్రా జట్టు రన్నర్‌గా నిలిచాయి. పికెట్ కేవీ ప్రిన్సిపల్ రూపేందర్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకల్లో అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, ఆర్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ నిఖత్ భాను ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ.. తానూ కేవీ పూర్వ విద్యార్థి కావడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రూపేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు కృషి



సమావేశంలో పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు

అడ్డగుట్ట: పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే కృషి చేస్తోందని ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ అధికారి కిషోర్ బాబు, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆడిటోరియంలో జాతీయ అధ్యక్షుడు సాగరం శ్రీధర్ నేతృత్వంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ 58వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 30 ఏళ్లుగా సేవలందించిన ఫెడరేషన్ వ్యవస్థాపకులు దివంగత వైఎన్. శాస్త్రికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీసీపీఓ కిషోర్ బాబు, పీసీఎండీ వెంకటేశ్వర్లు మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. పెన్షనర్ల సంక్షేమానికి ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వి. సుంకప్ప, ఉపాధ్యక్షుడు హరిదాస్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా



అమీర్‌పేట: జీఆర్‌ఎస్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో ఎస్ఆర్‌నగర్ అకాడమీ హైట్స్ బచ్‌పన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా 21 మంది మెడల్స్ సాధించారు. స్కేటింగ్ కోచ్ జైకుమార్‌కు ఉత్తమ కోచ్ ట్రోఫీ లభించింది. ప్రతిభ కనబర్చిన వారికి డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నీరజ్‌కక్కర్ అభినందించారు. చిన్నారులకు విద్యతో పాటు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు.

వివిధ వర్గాల వారితో గోవా సీఎం సమావేశం

రాంగోపాల్‌పేట్: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని ఓ డాక్టర్, ఓ వ్యాపారవేత్త కుటుంబాన్ని గోవా సీఎం ప్రమోద్ సావంత్ సందర్శించి సమావేశమయ్యారు. కృష్ణానగర్‌కాలనీలో ఉండే సోదురులైన డా. అజయ్‌కుమార్, డా. అనిల్ కుటుంబ సభ్యులతో చర్చించారు. మోదీ ప్రభుత్వ పనితీరు గురించి వారికి వివరించారు. మంజు థియేటర్ ప్రాంతంలోని సోమసుందరంవీధిలోని వ్యాపారవేత్త వేణుగోపాల్ కుటుంబాన్ని ప్రమోద్ సావంత్ సందర్శించారు. వేణుగోపాల్ తండ్రి నారాయణ మే నెలలో మరణించారు. నారాయణతో ఉన్న సాన్నిహిత్యంతో గోవా సీఎం వారి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఎస్పీలో చేరిక



బీఎస్పీలో చేరిన సన్నీ రాపాక

రాంగోపాల్‌పేట్: అక్షిత ఫౌండేషన్ చైర్మన్, సామాజిక కార్యకర్త సన్నీ రాపాకతో పాటు పలువురు నాయకులు బీఎస్పీ అధ్యక్షులు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. సోమవారం బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెం-2లో సుమారు 50 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘట నా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం



అరుణ కుమారి

అడ్డగుట్ట: ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధుల త వివరాల ప్రకారం..లాలాపేటలోని వినోభానగర్‌కు చెందిన బండారి అరుణ కుమారి (35) ప్రైవేటు ఉద్యోగిని. ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన అరుణ కుమారి రాత్రైనా ఇంటికి రాలేదు. భర్త శ్రీకాంత్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో తెలిసిన వారు, బంధువులను ఆరా తీసినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సనత్‌నగర్‌లో తొలి నామినేషన్



సనత్‌నగర్: తెలంగాణ రాజ్య సమితి పార్టీ తరుపున ఎస్.శ్రీశైలం సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ చివరి రెండు మూడు రోజుల్లో నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ 9న, బీజేపీ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి 8న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయా పార్టీల ప్రతినిధులు ఇప్పటికే స్పష్టం చేశారు.

లాస్య నందితకు మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న టీఎన్. శ్రీనివాస్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా ప్రచారం జోరందుకుంది. సోమవారం 8వ వార్డు లోక్‌నాథ్ సారథ్యంలో బొల్లారంలోని పలు బస్తీలు, రెండవ వార్డులో బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ ఇందిరమ్మనగర్, సీబీఎస్ నగర్, పోచమ్మ టెంపుల్ లైన్, అర్జున్ నగర్ బస్తీల్లో ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న తీరును వివరిస్తూ లాస్యనందితను గెలిపించాలని కోరారు. ప్రచారంలో శివ, దేవులపల్లి శ్రీనివాస్ కుమార్, ముదిరాజ్ జిలానీ, నర్సింహా, ధనరాజ్, శ్యామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓయూ ఎంబీఏ 50 ఏళ్ల లోగో ఆవిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ విభాగం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల లోగోను యూజీసీ చైర్మన్ ప్రొ.జగదీష్ కుమార్, వీసీ ప్రొ.రవీందర్, ఎంబీఏ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములుతో కలిసి ఆవిష్కరించారు.

పీహెచ్‌డీ డాక్టరేట్ నిరుద్యోగి భిక్షాటన



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న నిరుద్యోగి జ్యోతి పద్మజ సోమవారం ఆర్ట్స్ కాలేజీ వద్ద భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాల్లో తన కంటే జూనియర్‌కు ఉద్యోగం ఇచ్చి తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్ కారణంగానే తనకు ఉద్యోగం రాలేదని నియామకాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరింది.